


# కరపత్రం

SINCE 2014

ఆదివారం డిసెంబర్ 15 2024 సంపుటి :0 సంచిక : 67 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు: 4

# గురుకులాల ప్రక్షాళనకు చిత్తశుద్ధితో ఉన్నాం: సీఎం రేవంత్‌రెడ్డి

**రంగారెడ్డి జిల్లా చిలుకూరులో గురుకుల పాఠశాలను సీఎం రేవంత్‌రెడ్డి సందర్శించారు.**

**గురుకులాలు అంటే బహుముఖ ప్రతిభకు కేంద్రాలు అనే గుర్తింపు తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా చిలుకూరులో గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు.**

**గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో కామన్ డైట్‌ను ప్రారంభించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాలు, హాస్టళ్లలో ఒకే విధమైన మెనూ అమలు చేస్తున్నారు.**





పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త మెనూ రూపొందించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడారు.. గురుకులాల వ్యవస్థను పీవీ నరసింహారావు హయాంలో తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఇటీవలే డైట్ ఛార్జీలు పెంచారన్నారు. గురుకులాల బాట కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామని చెప్పారు. పాఠశాలల్లోని విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలు బాగున్నాయని చెప్పారు.

"టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం, మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి ఒకప్పటి గురుకులాల విద్యార్థులే. వీటిలో చదివి ఎందరో ఉన్నతస్థాయికి వెళ్లారు. ప్రైవేటు స్కూళ్లు వచ్చాక కొంత వరకు గురుకులాల ప్రభ తగ్గింది. వీటి ప్రక్షాళన కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. పదేళ్లుగా భారాస సర్కారు డైట్ ఛార్జీలు పెంచలేదు. మేం అధికారంలోకి వచ్చాక 40 శాతం పెంచాం. 16 ఏళ్లలో కాస్మోటిక్ ఛార్జీలు పెంచలేదు. 40 శాతం డైట్ ఛార్జీలు, 200 శాతం కాస్మోటిక్ ఛార్జీలు పెంచడం చరిత్ర. ఆర్థిక ఇబ్బందుల వల్ల పిల్లలను హాస్టళ్లలో చేరుస్తున్నారు. మనల్ని నమ్మి తల్లిదండ్రులు ఇక్కడికి పంపిస్తున్నారు. విద్యార్థుల మృతిపై మనం ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, సిబ్బందిపై ఉంది. ప్రతి నెల 10వ తేదీ లోపు గ్రీన్ ఛానల్ ద్వారా అన్ని విద్యాసంస్థలకు సంబంధించిన నిధులు వస్తాయి" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

## 'ఎక్స్'లో స్పందించేవారు..

### గతంలో ఎందుకని గురుకులాల్లో తిరగలేదు?: మంత్రి పొన్నం



హైదరాబాద్: గడచిన పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన పార్టీ నాయకులకు కనీస చిత్తశుద్ధి లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. గురుకులాలపై అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. షేక్‌పేట్‌లోని గురుకుల పాఠశాలను సందర్శించిన మంత్రి.. కలెక్టర్ అనుదీప్‌తో కలిసి కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. తెలంగాణ అన్ని రకాలుగా అభివృద్ధి చెందడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అందులో భాగంగానే విద్యార్థులకు మెరుగైన విద్య, ఆహారం అందించే దిశగా ముందుకెళ్తున్నట్లు చెప్పారు.

డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచామని.. దానివల్ల రాష్ట్రంలో 8 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిందన్నారు. 'ఎక్స్' వేదికగా స్పందించే వారు.. గతంలో గురుకులాల్లో ఎందుకు తిరగలేకపోయారని పొన్నం ప్రశ్నించారు. విద్యార్థులందరూ కష్టపడి తమ కుటుంబానికి, తమ గ్రామాలకు పేరు తేవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి భోజనం చేశారు. వారికి ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## కాటన్ మిల్లులో భారీ అగ్ని ప్రమాదం.. రూ.2 కోట్ల ఆస్తినష్టం!



యాదాద్రి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులోని మల్లికార్జున కాటన్ మిల్లులో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. భారీగా పత్తి దగ్ధమైంది. మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడుతుండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారమందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ ప్రమాదంలో సుమారు మూడు వేల క్వింటాళ్ల పత్తి దగ్ధమైనట్లు తెలుస్తోంది. ఆస్తినష్టం రూ. 2 కోట్లపైనే జరిగినట్లు సమాచారం. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్లు అధికారులు గుర్తించారు.

## ఆ ఘటనలో నా ప్రమేయం లేదు..

### బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తా: అల్లు అర్జున్



**అల్లు అర్జున్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. తనకు అండగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.**

హైదరాబాద్: క్లిష్ట సమయంలో తనకు మద్దతుగా నిలిచిన వారందరికీ నటుడు అల్లు అర్జున్ కృతజ్ఞతలు చెప్పారు. చంచల్‌గూడ జైలు నుంచి విడుదలైన అనంతరం ఆయన తన నివాసంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు.

## ఉద్యమం నుంచి ఉన్న తెలంగాణ తల్లినే ఆరాధిస్తాం.. స్పష్టం చేసిన ఎమ్మెల్సీ కవిత





**ఉద్యమం సమయం నుంచి ఉన్న తెలంగాణ తల్లినే ఆరాధిస్తామని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.**

**తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.**

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి దేశపతి శ్రీనివాస్, మాజీ ప్రభుత్వ సలహాదారు రమణాచారి, వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, జూలూరి గౌరీ శంకర్, ఆయాచితం శ్రీధర్, తేలు విజయ, దేవీప్రసాద్, కవులు, కళాకారులు హాజరయ్యారు. తెలంగాణ తల్లి విగ్రహం రూపం మార్పు, తెలంగాణ అస్థిత్వం తదితర అంశాలపై జాగృతి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.

### ఏడాది పాలనలో మీరు సాధించిన ఘనత ఇదే..

## రేవంత్‌పై హరీశ్‌రావు సెటైర్లు



సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని సర్కారుపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు గుప్పించారు. 14 రోజులు గడిచినా జీతాలు ఇవ్వకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకటో తేదీ నాడే ఉద్యోగులకు జీతాలు అంటూ రేవంత్‌రెడ్డి గప్పాలు కొట్టారన్నారు. డిసెంబర్‌లో 14వ తేదీ వచ్చినా 39,568 మంది అంగన్‌వాడీ టీచర్లలు, ఆయాలు జీతాలు రాక ఆవేదన చెందుతున్న పరిస్థితి ఉందన్నారు. పది నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దెలు కూడా చెల్లించని దుస్థితి నెలకొందన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో రేవంత్ సర్కారు సాధించిన ఘనత ఇదేనన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయులను, ఉద్యోగులను సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. హైకోర్టు ఉత్తర్వులు ఉంటే తప్ప హక్కుగా రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా వారిని, వారి కుటుంబాలను క్షోభకు గురి చేస్తున్నావంటూ మండిపడ్డారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఇలా లక్షల మంది సకాలంలో జీతాలు రాక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నట్లు చేస్తున్న డబ్బా ప్రచారాన్ని ఇకనైనా ఆపాలని.. ఉద్యోగులందరికీ సకాలంలో జీతాలు చెల్లించి మాట నిలుపుకోవాలని హితవు పలికారు.



## రేవంత్‌రెడ్డి అజ్ఞానానికి

### ప్రభుత్వ ఉద్యోగి సంజీవరెడ్డి బలిపశువైండు :

రేవంత్ రెడ్డి అజ్ఞానానికి, అరాచకానికి మరో ప్రభుత్వ ఉద్యోగి సంజీవరెడ్డి బలిపశువైండని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. రైతులకు బేడీలు వేసిన అమానవీయ సంఘటనలో సంబంధం లేని సంగారెడ్డి జైలు సూపరింటెండెంట్ సంజీవ రెడ్డిని అకారణంగా సస్పెండ్ చేశారని ఆయన విమర్శించారు. బేడీలు జైలు అధికారులు వేయరని.. ఆర్మడ్ రిజర్వ్ పోలీసులే వేస్తారు అన్న కామన్ సెన్స్ కూడా లేదు ఈ ప్రభుత్వానికి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ సంగారెడ్డి జైలుకు లగచర్ల రైలును పరామర్శించడానికి వెళ్తే.. సంజీవరెడ్డి సెల్యూట్ చేసిండని ఎవరో సీఎం చెప్పింద్రంట!.. దాంతో ఆయనను పగబట్టిండని ఆరోపించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం డిసెంబర్ 15 2024

# సంపాదకీయం

## ఆర్థిక భారత అద్భుతానికి మోదీ ఎలా ఆద్యుడు?

విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఎలెక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ నాగరీక మర్యాదలు తెలిసినవారు, విద్యాధికులు, మృదుస్వభావులు. ప్రజ్ఞావంతుడైన దౌత్యవేత్తగా జైశకంర్ సుప్రసిద్ధుడు. ఉదారవాదిగా పేరు పొందారు. మాజీ ఐఏఎస్ అధికారి అయిన వైష్ణవ్ వ్యాపార రంగంలో విజయాలు సాధించి పార్లమెంటుకు ఎన్నికై వివిధ మంత్రిత్వ శాఖలను నిర్వహించిన ప్రతిభావంతుడు. అర్థశాస్త్రం, ఆర్థిక రంగ వ్యవహారాలలో జైశంకర్‌కు ఆసక్తి ఉన్నదన్న విషయం నాకు తెలుసు. వార్టన్ బిజినెస్ స్కూల్‌లో గ్రాడ్యుయేట్‌గా వైష్ణవ్ అర్థశాస్త్రాన్ని అధ్యయనం చేశారు. భారత ఆర్థిక వ్యవస్థ స్థితిగతుల గురించి ఈ ఇరువురికీ బాగా తెలుసు. టీవీ ఛానెల్ ఎన్‌డీటీవీ ఇటీవల నిర్వహించిన ఒక సదస్సులో దేశ ఆర్థిక వ్యవస్థపై ఇరువురూ తమ అభిప్రాయాలను సుదీర్ఘంగా వ్యక్తం చేశారు.

అంకెలు ప్రతిభావంతులను సైతం గందరగోళపరుస్తాయి. జైశంకర్ తొలుత భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం గురించి సగర్వంగా మాట్లాడారు: నేడు మన ఆర్థిక వ్యవస్థ 4 లక్షల కోట్ల డాలర్ల విలువైనది. 80,000 కోట్ల డాలర్ల విదేశీ వాణిజ్యం జరుపుతున్న ఆర్థిక వ్యవస్థ మనది. మన దేశంలో విదేశీ మదుపులను చూస్తే మన ఆర్థిక వ్యవస్థ ఎంత పెద్దదో మీకు అర్థమవుతుంది…’. వాస్తవం ఇందుకు చాలా దూరంగా ఉంది సుమా! మనం ఇంకా 4 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందలేదు. 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందాలని మనం లక్ష్యం నిర్దేశించుకున్నాం. ఆ గమ్యానికి చేరేందుకు మనం ఆపసోపాలు పడుతున్నాం. ఈ లక్ష్య సాధన విషయమై ఆర్థికమంత్రి, ప్రభుత్వ ఆర్థిక సలహాదారు గత ఆరేళ్లలో మూడుసార్లు భిన్న రీతుల్లో మాట్లాడారు!

2023–24 ఆర్థిక సంవత్సరాంతంలో మన దేశం నుంచి 437 బిలియన్ డాలర్ల విలువైన సరుకులు ఎగుమతి అయ్యాయిబీ 677 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులు దిగుమతి చేసుకున్నారు. వాణిజ్య లోటు 240 బిలియన్ డాలర్లు. మన దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2021–22లో 84.84 బిలియన్ డాలర్ల నుంచి 2023–24లో 70.95 బిలియన్ డాలర్లకు తగ్గిపోయాయి. ‘ప్రజలకు లబ్ధి, ముఖ్యంగా ఆహారాన్ని సమకూర్చడంలో మన ఆర్థిక వ్యవస్థ సామర్థ్యం గురించి ఘనంగా మాట్లాడారు. తలసరిన ఐదు కిలోల ఆహారధాన్యాలను ఉచితంగా సరఫరా చేయడం గురించి జైశంకర్ మాట్లాడుతున్నారా? నేనైతే ఆ ఉచిత సరఫరా ప్రజల దురవస్థలు, అల్ప వేతనాలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాల కొరతకు సూచనగా పరిగణిస్తాను. కోవిడ్ కాలంలో వాక్సిన్ల ఉత్పత్తిదారుగా, సృష్టికర్తగా భారత్ సామర్థ్యాన్ని కూడా ఆయన ప్రశంసించారు. నిజమేమిటి? మన దేశంలో రూపొందించిన ఏకైక వ్యాక్సిన్ కోవాక్సిన్. దీని ప్రభావశీలత 80 శాతంగా ఉందని నిర్ధారణ అయింది. మరో వాక్సిన్ కోవిషీల్డ్. ఇది 90 శాతం ప్రభావశీలతను కలిగి ఉన్నదని రుజువయింది. అయితే ఆక్స్‌ఫర్డ్ – ఆస్ట్రజెనెకా నుంచి లైసెన్స్ పొంది ఉత్పత్తి చేసిన వ్యాక్సిన్ ఇది. మన దేశంలో వేసిన 200 కోట్ల వ్యాక్సిన్లలో 160 కోట్లు కోవిషీల్డ్ వ్యాక్సిన్లే.

వైష్ణవ్ సైతం మన ఆర్థిక వ్యవస్థ పురోగతి గురించి ఎంతో ఉద్వేగ భరితంగా మాట్లాడారు. భారత్ 6 నుంచి 8 శాతం సుస్థిర వృద్ధిరేటు సాధించడం గురించి ఆయన మాట్లాడారు. ఈ పురోగతికి నాలుగు ప్రధాన కారణాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వాటిని మూలధన పెట్టుబడులు, వస్తూత్పత్తి, సమ్మిళిత వృద్ధి, సరళీకరణగా ఆయన గుర్తించారు. అయితే వాస్తవాలు ఏమిటి? మన స్థూల దేశియోత్పత్తి (జీడీపీ) పెరుగుదల రేటు కోవిడ్ ప్రభావిత ఏడాదితో సహా గత ఆరు సంవత్సరాలుగా సగటున 4.99 శాతంగా ఉంటోంది. కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయం, ప్రభుత్వ రంగ సంస్థల మదుపులు వాస్తవంగా 2019%–%20లో జీడీపీలో 4.7 శాతం నుంచి 2023%–%24లో 3.8 శాతానికి తగ్గిపోయింది.జీడీపీలో వస్తూత్పత్తి రంగ వాటా 2014లో 15.07 శాతం నుంచి 2019లో 12.84 శాతానికి, 2023లో 12.84 శాతానికి తగ్గిపోయింది. సమ్మిళిత వృద్ధి అనేది తీవ్ర చర్చనీయాంశం. అటువంటి పురోగతి ఉన్నదా లేదా అనేది ఇంత చిన్న వ్యాసంలో నిరూపించడం కష్టం. కనుక ఈ అంశాన్ని వదిలివేస్తున్నాను. ఇక సరళీకరణ విషయానికి వస్తే పది సంవత్సరాల క్రితం కంటే ఇప్పుడే, ముఖ్యంగా క్రమబద్ధీకరణ చట్టాల కింద నియమనిబంధనలు ఎక్కువగా ఉన్నాయి. ఏ చార్టర్డ్ అకౌంటెంట్ లేదా కంపెనీ సెక్రెటరీ లేదా లీగల్ ప్రాక్టీషనర్‌ను అయినా అడగండి, నియమ నిబంధనలు, నియంత్రణలు ఎంత ఎక్కువ స్థాయిలో అదనంగా వచ్చాయో వివరిస్తారు. 1991లో సరళీకృత ఆర్థిక విధానాలు అమలులోకి వచ్చిన తరువాత దేశ ఆర్థిక వ్యవస్థ సాధించిన పురోగతి గురించి జైశంకర్, వైష్ణవ్‌లు సహేతుకంగా గర్వపడవచ్చు. అది ఆర్థిక స్వాతంత్ర్య నవోదయం. అయితే దానికి 1997లో (ఆసియన్ ఆర్థిక సంక్షోభం), 2008 (అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం), 2016 (పెద్దనోట్ల రద్దు), 2020 (కోవిడ్ విలయం) తీవ్ర అవరోధాలు ఎదురయ్యాయి. అయినప్పటికీ కేంద్రంలో వరుసగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు తమకు ముందున్న ప్రభుత్వాల భుజస్కంధాలపై నిలబడి భవిష్యత్తులోకి దృష్టి సారించి, దేశ సౌభాగ్య సౌధాన్ని మరింత సమున్నతం, శోభావంతం చేశాయి. ఆర్థిక పురోగతి పూర్తిగా దిగజారిపోయిన పరిస్థితుల నుంచి తమ పాలనా ప్రస్థానాన్ని ప్రారంభించామని మోదీ ప్రభుత్వం చెప్పుకోవడంలో సత్యం లేదు. ఏ ప్రభుత్వమూ అలా ప్రారంభమవదు. కోవిషీల్డ్ వ్యాక్సిన్ విషయాన్నే తీసుకోండి. సీరమ్ ఇనిస్టిట్యూట్‌ను 1996లో నెలకొల్పారు. ఔషధాల ఉత్పత్తిలో ఒక బృహత్తర సంస్థగా అది అభివృద్ధి చెందింది. అపార అనుభవాన్ని సంతరించుకుంది. కోవిడ్ ఉపద్రవం సంభవించినప్పుడు ఆస్ట్రజెనెకా సాంకేతికతను సమకూర్చుకునే సామర్థ్యాన్ని కలిగి ఉన్నది. వ్యాక్సిన్ల తయారీలో ప్రపంచ అగ్రగామి సంస్థగా ఆవిర్భవించింది. అలాగే అతిగా పొగుడుతుండే %JAM -% జన్ ధన్ ఖాతాలు, ఆధార్, మొబైల్ ఆద్యక్షర సంక్షిప్త పదం– నే తీసుకోండి నో–ఫ్రిల్స్ బ్యాంక్ ఖాతాల (జీరో బ్యాలెన్స్ ఎకౌంట్)కు బీజాలు ఇరువురు ఆర్బీఐ గవర్నర్ల– డాక్టర్ ఎస్. రంగరాజన్ (1992–97), డాక్టర్ బిమల్ జలాన్ (1997–2003) హయాంల్లో పడ్డాయి. లక్షలాది కొత్త ఖాతాలు ప్రారంభమయ్యాయి. ప్రప్రథమ ఆధార్ నంబర్‌ను యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా మార్గదర్శకత్వంలో సెప్టెంబర్ 29, 2010న జారీ అయింది. సెల్‌ఫోన్ ద్వారా తొలి కాల్ చేసిన జూలై 31, 1995న మొబైల్ విప్లవం ప్రారంభమయింది.

## ఉద్యమం నుంచి ఉన్న తెలంగాణ తల్లినే ఆరాధిస్తాం.. స్పష్టం చేసిన ఎమ్మెల్సీ కవిత

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు కవిత. అనంతరం కవిత మాట్లాడుతూ మన సంస్కృతిపై దాడి జరుగుతుంటే ప్రతీ ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ తల్లిపై ప్రేమ లేదని.. కాబట్టి సీఎం రేవంత్ రెడ్డి రూపం మార్చారన్నారు.

తెలంగాణ తల్లి చేతిలో ఉన్న బతుకమ్మను చూస్తే తెలంగాణ సమాజాన్ని చూసినట్లుంటుందని.. అందరం కలిస్తేనే ఒక అందమైన బతుకమ్మ అవుతుందన్నారు. అందరం కలిస్తేనే అందమైన సమాజం అవుతుందన్న సందేశం ఇచ్చేది బతుకమ్మ అని.. అలాంటి బతుకమ్మ తెలంగాణ తల్లి చేతిలో లేకపోతే తెలంగాణ సమాజంలో స్నేహశీలత, సుహృద్భావం ఎలా కనిపిస్తుంది ? అంటూ ప్రశ్నించారు. మన అస్థిత్వాన్ని దెబ్బతీసే ధైర్యం ఎవరికీ లేదని.. కానీ, అలాంటి ప్రయత్నాలు జరుగుతుంటే అడ్డుకోవాల్సిన అవసరం మనకు ఉందన్నారు. ఉనికి, సంస్కృతిపై దాడి జరుగుతుంటే మాట్లాడకపోతే చరిత్ర మనల్ని క్షమించదన్నారు. తెలంగాణ ఉద్యమం, తెలంగాణ పునర్నిర్మాణంలో రేవంత్ రెడ్డి ఎక్కడా లేరన్నారు. తెలంగాణ పునర్నిర్మాణ సమయంలో రేవంత్ రెడ్డి కేసీఆర్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర చేశారని.. ఉద్యమకాలంలో ఉద్యమకారులపై తుపాకీ ఎక్కిపెట్టిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని గుర్తు చేశారు.

ఉద్యమ సమయంలో నుంచి ఉన్న తెలంగాణ తల్లినే ఆరాధిస్తామని.. ఒక చేతిలో జొన్నకర్ర, మరొక చేతిలో బతుకమ్మ ధరించిన తెలంగాణ తల్లి వైభవంపై పద్యాలు, కవితలు రచించి పుస్తకాలు జాగృతి తరఫున వెలువరించనున్నట్లు పేర్కొన్నారు. పిల్లలు వాడే నోట్ బుక్స్, రైటింగ్ ప్యాడ్స్ అన్నింటిపై తెలంగాణ తల్లిని ముద్రించి పిల్లలకు ఇచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. తెలంగాణ తల్లికి ఆరాధానతో కార్యక్రమం మొదలుపెట్టే సంప్రదాయాన్ని ఇక ముందూ కొనసాగిస్తామన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాలను గ్రామ గ్రామానా ప్రతిష్టించే కార్యక్రమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బతుకమ్మ అగ్రవర్ణాల పండుగ అన్న వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని తెలంగాణ జాతికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రస్తుతం రేవంత్ రెడ్డి రూపొందించి.. ఆవిష్కరించిన విగ్రహానికి కాంగ్రెస్ మాతగా నామకరణం చేస్తూ తీర్మానం చేశారు.

## ఇంకెందరు ప్రాణాలు కోల్పోవాలి రేవంత్ రెడ్డి..? నిలదీసిన హరీశ్‌రావు

హైదరాబాద్ : విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి మాటలు నీటి మూటలే అయ్యాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. మాటలే తప్ప చేతలు లేని ముఖ్యమంత్రి నిర్లక్ష్య తీరు వల్ల ఇంకెంత మంది విద్యార్థులు ఆస్పత్రి పాలు కావాలి..? ఇంకెందరు ప్రాణాలు కోల్పోవాలి..? అని హరీశ్‌రావు నిలదీశారు. వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యం పాలై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని లీలావతిని హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.



ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటు. సంక్షేమ పాఠశాలలను సంక్షోభ పాఠశాలలుగా మార్చారు. మేము ప్రశ్నిస్తే వార్డెన్లు, ప్రిన్సిపల్స్ మీద చర్యలు తీస్కొని చేతులు దులుపుకుంటున్నారు. నిధులు విడుదల చేయకుండా ఇబ్బంది పెడుతున్నరు. పెండింగ్ బిల్లులు క్లియర్ చేయడం లేదు. ఇప్పటికైనా కళ్లు తెరిచారు స్వాగతిస్తున్నాము. గురుకులాల మొక్కుబడి సందర్శన కాదు.. ఆ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టండి. ఫోటోలకు పోజులు ఇవ్వడం కాదు.. పట్టెడు పనికొచ్చే బువ్వ పెట్టి పొట్టలు నింపండి. ఫుడ్ పాయిజన్ జరిగిన తర్వాత విద్యార్థులకు సకాలంలో చికిత్స అందించకపోవడం వారి ప్రాణాల మీదకు వస్తున్నది. ప్రభుత్వ నిర్లక్ష్యం విద్యార్థుల ప్రాణాలు బలిగొంటున్నాయి అని హరీశ్‌రావు తెలిపారు.

ఇప్పటికైనా కళ్లు తెరవండి.. ప్రచారం కోసం కాదు పిల్లల భవిషత్తు కోసం ఆలోచించండి అని హరీశ్‌రావు కోరారు. చలికాలం వణుకుతున్నారు, వేడి నీళ్ళు లేవు. బట్టలు కూడా వారికి ఇవ్వలేదు, ఆ సమస్యలు పరిష్కరించండి. హాస్టళ్లలో పని చేసే సిబ్బంది జీతాలు ఇవ్వడం లేదు. గ్రీన్ ఛానెల్ ఉంటే ఆరు నెలలుగా హాస్టళ్లకు ఎందుకు డబ్బులు ఇవ్వటం లేదు అని హరీశ్‌రావు అడిగారు.

## అల్లు అర్జున్ మామ మా పార్టీకి చెందిన నాయకుడే: మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్: నటుడు అల్లు అర్జున్ అరెస్టు వ్యవహారంపై తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అల్లు అర్జున్ మామ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడేనని తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమేనని వ్యాఖ్యానించారు.




“సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో మహిళ ప్రాణాలు కోల్పోయింది. ఆమె కుమారుడు చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నాడు. తెలుగు చిత్రసీమకి.. కాంగ్రెస్‌కు విడదీయరాని బంధం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం కృషి వల్లే తెలుగు చిత్రపరిశ్రమ హైదరాబాద్‌కు వచ్చింది. స్టూడియోల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వమే భూములిచ్చింది. పదేళ్లలో తెలంగాణ తల్లి విగ్రహంపై భారాసకు ధ్యాస ఎందుకు లేదు? ఈ–రేసింగ్‌లో స్కామ్ జరిగినట్టు అధికారులు గుర్తించారు. అందులో కేటీఆర్ అక్రమాలు చేసినట్టు తేలితే చర్యలు తప్పవు” అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

## ఒక ప్రాంతంపై రెండు పాలనలుంటే గందరగోళమే: రాష్ట్ర హెూదాపై ఒమర్ అబ్దుల్లా

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హెూదా పునరుద్ధరించాలని సీఎం ఒమర్ అబ్దుల్లా మరోసారి కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ రాష్ట్ర హెూదా అంశాన్ని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మరోసారి ప్రస్తావించారు. రాష్ట్ర హెూదా పునరుద్ధరిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని.. దాన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కేంద్రపాలిత ప్రాంతంగా ఉండడం వల్ల కలిగే ప్రయోజనం ఏమీ లేదన్నారు.

“జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా మారడం వల్ల కలిగిన ఒక్క ఉపయోగమూ ఇప్పటికీ తెలియలేదు. క్రీడల్లో ఒక్కరే కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. అదే అంతకు మించి సారథులు ఉంటే గందరగోళానికి దారి తీయవచ్చు. అలాగే దేశానికి ఒకే ప్రధానమంత్రి, ఒకటే కేంద్రప్రభుత్వం ఉంటుంది. ఒక ప్రాంతంలో రెండు అధికారాలు ఉంటే అక్కడ అభివృద్ధికి అవకాశం ఉండదు. ఎన్నికైన ముఖ్యమంత్రికి



తన మంత్రివర్గంతో కలిసి ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకునే అధికారం ఉంటుంది. ఇద్దరి చేతుల్లో అధికారం ఉంటే అక్కడ పురోగతి ఉండదు” అని ప్రముఖ జాతీయ మీడియా సంస్థ పీటీఐకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు.

“జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హెూదాను పునరుద్ధరిస్తామని కేంద్రంలోని ఎన్డీయే సర్కార్ ప్రజలకు హామీ ఇచ్చింది. ఎన్నికల సమయంలో పదే పదే ఇదే ప్రచారం చేసింది. ఇప్పుడు ఆ వాగ్దానాన్ని నెరవేర్చాలి. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాలు చర్చించి దీనిపై నిర్ణయం తీసుకోవాలి” అని కోరారు. కాగా.. 2019లో ఆర్టికల్ 370 రద్దవ్వడంతో రాష్ట్ర హెూదా కోల్పోయి కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత జమ్మూకశ్మీర్‌లో జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) విజయం సాధించిన సంగతి తెలిసిందే.

సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఒమర్ అబ్దుల్లా.. రాష్ట్ర హెూదాను తిరిగి తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఆయన మంత్రివర్గం చేసిన తీర్మానాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదించారు. తాజాగా రాష్ట్ర హెూదా అంశంపై మరోసారి తన గళాన్ని వినిపించారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాను దీనిపై దృష్టి సారించాలని కోరారు.

## ఇలా మీ కుటుంబంలో జరిగితే.. అంగీకరించగలరా రాహుల్ జీ..? : కేటీఆర్

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ సర్కార్ చేపట్టిన కూల్చివేతలపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు మీ కుటుంబంలో జరిగితే, అంగీకరించగలరా..? రాహుల్ గాంధీ జీ అని కేటీఆర్ అడిగారు. పట్టింపు, మానవత్వం లేని ప్రభుత్వాలే ఇలాంటి చర్యలకు పాల్పడుతాయి. తెలంగాణలో ఇంట్లో ఇద్దరు మహిళలు ఉండగానే.. బుల్డోజర్లతో ఆ ఇండ్లను కూలగొట్టారు. మరి వారి భౌతిక భద్రతకు ఎవరూ బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పేదలకు ప్రేమ పంచుతాం అనడం అంటే ఇదేనేమో అని కేటీఆర్ విమర్శించారు.

## గురుకులాల ప్రక్షాళనకు చిత్తశుద్ధితో ఉన్నాం: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

గురుకుల బాటలో మంత్రులు

గురుకులాల బాటలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు గురుకులాలను సందర్శించారు. ఖమ్మం జిల్లా బోనకల్ పాఠశాలలో కామన్ డైట్ మెనూను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. షేక్‌పేట గురుకుల పాఠశాలను మంత్రి పొన్నం ప్రభాకర్ (ౡశీఅఖుఎ ౡతీఖుఎష్ట్రఖుఌఖుతీ) సందర్శించారు. తరగతి గదిలో డిజిటల్ బోర్డు పనితీరును పరిశీలించారు. సికింద్రాబాద్ మహేంద్రహిల్స్‌లో గురుకుల పాఠశాలను మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల, కళాశాలల్లో విద్యా బోధన, సమస్యలపై మంత్రి ఆరా తీశారు. భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలో గురుకుల పాఠశాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. ఏకలవ్య పాఠశాల విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం మాదిరిపురంలో ప్రభుత్వ వసతి గృహాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సందర్శించారు.

## ఆ ఘటనలో నా ప్రమేయం లేదు..

మొదటిపేజీ తరువాయి

“దేశవ్యాప్తంగా నాకు మద్దతు ఇచ్చిన వారందరికీ ధన్యవాదాలు. మీ ప్రేమాభిమానాలతో నా హృదయం నిండింది. నాపై అపరిమితమైన ప్రేమ చూపించిన నా అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు” అని అల్లు అర్జున్ అన్నారు. సంధ్య థియేటర్ వద్ద చోటుచేసుకున్న ఘటన (ౡఖుఅఎష్ట్రఖు ఎష్ట్రమఫ్తీవ ×అఎఅఎవత్) గురించి మాట్లాడుతూ..“దురదృష్టకర ఘటన. ఆ కుటుంబానికి జరిగిన దానికి నేను ఎంతగానో చింతిస్తున్నా. అన్ని విధాలుగా అండగా ఉంటా. ఉద్దేశపూర్వకంగా జరిగిన ఘటన కాదు. ప్రమాదవశాత్తూ జరిగింది. అనుకోకుండా జరిగిన ఈ ఘటనలో నా ప్రమేయం లేదు. కుటుంబంతో కలిసి నేను థియేటర్‌లో సినిమా చూస్తున్నప్పుడు ఇది చోటుచేసుకుంది. సుమారు 20 ఏళ్ల నుంచి ఆ థియేటర్‌కు నేను వెళుతున్నా. దాదాపు 30 సార్లు అక్కడ సినిమా చూశా. గతంలో ఎప్పుడూ ఇలాంటి ఘటన జరగలేదు. త్వరలోనే ఆమె కుటుంబాన్ని కలుస్తా. ప్రస్తుతం కేసు కోర్టులో ఉంది. దీని గురించి మాట్లాడాలనుకోవడం లేదు” అని అన్నారు. అల్లు అర్జున్ తండ్రి అల్లు అరవింద్ కూడా మీడియాతో మాట్లాడారు. ఈసందర్భంగా జాతీయ, స్థానిక మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు.

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ తెరకెక్కించిన చిత్రం ‘పుష్ప 2 ది రూల్’. డిసెంబర్ 5న ఇది ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. ప్రేక్షకుల ఆదరణను దృష్టిలోఉంచుకుని డిసెంబర్ 4న ఈ సినిమా ప్రీమియర్ షోలు పలుచోట్ల ప్రదర్శించారు. హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో ప్రదర్శించిన ‘పుష్ప 2’ బెనిఫిట్ షోకు అల్లు అర్జున్, తన కుటుంబసభ్యులతో హాజరయ్యారు. ఆయన్ని చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో పోటీపడ్డారు. దీంతో తొక్కిసలాట చోటుచేసుకొని రేవతి అనే మహిళ మృతి చెందింది. ఆమె తనయుడు శ్రీతేజకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు థియేటర్‌కు సంబంధించిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఏ11గా అల్లు అర్జున్‌ను పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన్ని అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరుచేయడంతో శనివారం ఉదయం ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. జైలు నుంచి ఇంటికి చేరుకున్న అల్లు అర్జున్‌ను తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన దర్శక – నిర్మాతలు, హీరోలు కలిశారు. తొక్కిసలాట ఘటన, అరెస్ట్, తాజా పరిణామాల గురించి చర్చించారు. ం

## రేవంత్‌రెడ్డి అజ్ఞానానికి ప్రభుత్వ ఉద్యోగి సంజీవరెడ్డి బలిపశువైండు :

మొదటిపేజీ తరువాయి

మాజీ మంత్రి, ఎమ్మెల్యేకు సెల్యూట్ చేయొద్దా? అంటూ ప్రశ్నించారు. నిజానికి ఈ విషయంలో సస్పెండ్ చేయాల్సింది ప్రస్తుత కొడంగల్ ఎమ్మెల్యే, హెూంమంత్రి, సీయం రేవంత్ రెడ్డినేనన్నారు.

లగచర్ల రైతుల భూములను బలవంతంగా గుంజుకునే కుట్ర చేసిందెవరు..? తన చేతికి మన్ను అంటకుండా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను, ఇతర అధికారులను రైతుల మీదికి ఉసిగొల్పింది రేవంతేనన్నారు. పోలీసుల ను కొడంగల్ రైతుల మీదకి పంపించి వాళ్లను జైల్లో వేయించిన హెూం మంత్రి ఎవరు? తన ప్రజలకోసం పోరాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డిని రైతులను అక్రమంగా నెల రోజుల నుండి జైలులో నిర్బంధించింది ఎవరు? నరేందర్ రెడ్డికి బెయిల్ రాకుండా అడ్డుకుంటున్నదెవరు? తెలంగాణలో ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న ప్రతి పక్షాలపై రోజూ అక్రమ కేసులు పెడుతున్నదెవరు? అంటూ ఆయన నిలదీశారు. కొండారెడ్డి పల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్య కేసులో నిందితులైన ఎనుముల బ్రదర్స్‌ను కాపాడుతున్నది రేవంతేనని స్పష్టం చేశారు. ఇప్పుడు ఎవరిని సస్పెండ్ చేయాలి..? జైలర్ సంజీవరెడ్డినా..? జనకంటక రేవంత్ రెడ్డినా? అంటూ ఆయన సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేశారు.

## గ్రూప్ 2 పరీక్షల ఫలితాలు వేగంగా ఇస్తాం: టీజీపీఎస్సీ ఛైర్మన్

హైదరాబాద్: ఆదివారం, సోమవారం జరగనున్న గ్రూప్ 2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. పది రోజులుగా అన్ని అంశాలను సమీక్షించామని చెప్పారు. పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయని.. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై నమ్మకముంచి పరీక్షలు రాయాలని కోరారు. నాంపల్లి టీజీపీఎస్సీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. “గ్రూప్ 2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశాం. అభ్యర్థులు ఎలాంటి అపోహలు, అనుమానాలు పెట్టుకోవద్దు. మెరిట్ ఉంటే మిమ్మల్ని ఎవరూ ఆపలేరు. 5.51 లక్షల మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ప్రతి ఒక్కరికీ బయోమెట్రిక్ తప్పనిసరి. ప్రశ్నా పత్రాలకు సంబంధించి 58 స్టోరేజ్ పాయింట్లు పెట్టాం. అభ్యర్థికి తప్ప ప్రశ్నాపత్రం ఎవరికీ తెలిసే అవకాశం లేదు. 2015లో గ్రూప్ 2 నోటిఫికేషన్ అమలుకు చాలా సమయం తీసుకున్నారు. ఈ సారి వేగంగా ఫలితాలు ఇస్తాం” అని బుర్రా వెంకటేశం తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం వస్తున్న సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున అభివృద్ధి సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయని రాష్ట్ర పర్యాటక అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు.





**కరపత్రం దినపత్రిక మీద నర్సాపూర్.**
మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో శనివారం నాడు ఆమె పర్యటించారు ఈ సందర్భంగా నర్సాపూర్ లోని అర్బన్ పార్కులో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు అనంతరం నియోజకవర్గం లోని ఆయా మండలాల్లో పర్యటించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మీడియాతో మాట్లాడుతూ సంవత్సరం కాలము ప్రజాపాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని మరిన్ని కార్యక్రమాలు వేగవంతంగా రానున్న రోజుల్లో కొనసాగిస్తామని ప్రకటించారు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కొత్త నిశ్చయంతో ఉందని అన్నారు ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి పచ్చదనం పెంచడం కోసం ప్రజల సహకారం అవసరమని కూడా వ్యాఖ్యానించారు కార్యక్రమంలో పెద్ద ఎత్తున అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి...

**- పార్టీ పటిష్టతకు కృషి....**
**- బిజెపి పార్టీ అధికార ప్రతినిధి సమ్మిరెడ్డి....**

**కరపత్రం శంకర పట్నం డిసెంబర్ 14**
కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బిజెపి పార్టీ పటిష్టతకు నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని బిజెపి పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలం, కేశవపట్నం, ఆర్క%శీ%డ్ల గ్రామాల్లో, పార్టీ మండలాధ్యక్షుడు ఎనుగుల అనిల్ అధ్యక్షతన ఎన్నికల అధికారి ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో బూత్ కమిటీలను నియామకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అధికార ప్రతినిధి సమీరెడ్డి మాట్లాడారు. కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వము ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, కేంద్రం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అండదండలతో ప్రతి కార్యకర్త నాయకులు సైనికుల పనిచేసే కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు అందే విధంగా తమ వంతు కృషి చేస్తూ, బిజెపి పార్టీ పటిష్టతకు సైనికుల పనిచేయాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేశవపట్నం 111 బూత్ అధ్యక్షులుగా తోట అనిల్, ప్రధాన కార్యదర్శిగా తోట అరవింద్, ఆర్క%శీ%డ్ల బూత్ అధ్యక్షులుగా నేదురు అరుణ్, ప్రధాన కార్యదర్శిగా చెర్ల సురేష్, తోపాటు తదితరులు నియామకం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనిల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు కొమురయ్య, ఎస్టీ మోర్చా మండలాధ్యక్షుడు బిజిలి సారయ్య, మహిళా మోర్చా అధ్యక్షురాలు వరాల వెంకటలక్ష్మి, శక్తి కేంద్ర ఇన్చార్జులు రాస మల్ల శ్రీనివాస్, చెర్ల శ్రీనివాస్, బొజ్జ సాయి, గుర్రం శ్రీనివాస్ గొల్లిపెల్లి శ్రీనివాస్ తో పాటు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ విద్య, క్రీడలు, పౌష్టికాహారం...

**- గురుకుల పాఠశాలలో కామన్ డైట్ మెనూ...**
**- తల్లిదండ్రులు సహకరించాలి...**
**- ఎమ్మెల్యే సత్యనారాయణ....**

**కరపత్రం శంకరపట్నం డిసెంబర్ 14**
తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ విద్య, విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని రుచికరంగా అందించేందుకే ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారని మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం, మానకొండూర్ మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలలో కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, తో ఎమ్మెల్యే సత్యనారాయణ ప్రారంభించారు ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే




సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన కార్పొరేట్ విద్యతోపాటు, క్రీడలను, పౌష్టికాహారాన్ని రుచిగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వము ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ,రాష్ట్ర మంత్రివర్గము, ఎమ్మెల్యేలు అందరం ప్రత్యేక చొరవ తీసుకోవడం జరిగిందని, ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు కామన్ డైట్ మెనూ తో పాటు మెస్ చార్జీలను జరిగిందని, ప్రభుత్వ పాఠశాలలో విద్యతో పాటు విద్యార్థుల శారీరక, మానసిక, మేధస్సు, దృఢత్వాన్ని పెంచేందుకు క్రీడలను కూడా ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు ప్రభుత్వము ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా ఎదగాలని, ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, డి ఆర్ డి ఓ శ్రీధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఓదేలు ఎంఈఓ మధుసూదన్ ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు వేస్తుంది..
# మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ అయాజ్...





**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట డిసెంబర్ 14...**

జమ్మికుంట : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ అయాజ్ అన్నారు. శనివారం స్థానిక బీసీ వెల్ఫేర్ పాఠశాలలో కాస్మోటిక్ చార్జీల పెంపు, కామన్ డైట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భోజన సదుపాయం విషయంలో డైట్,కాస్మోటిక్ చార్జీల పెంపు చరిత్రాత్మక ఘట్టమని తెలిపారు. వసతి గృహాల్లో ఉంటూ చదువుకునే విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఉన్నత చదువులు చదివి వివిధ రంగాల్లో అత్యున్నత స్థానాల్లో ఉన్న వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం వసతిగృహాల్లోని వంట గది, డైనింగ్ హాల్, తరగతి గదులను ఆయన పరిశీలించారు. విద్యార్థులు మొదట విషయ పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని తద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిజిస్టర్ బి ప్రవీణ్ కుమార్, మండల విద్యాధికారి హేమలత, ప్రిన్సిపాల్ సి ఎచ్ లచయ్య, పేరెంట్ కమిటీ సభ్యులు రజినీకర్, లావణ్య లతో పాటు పలువురు పాల్గొన్నారు. మరియు ఎస్సీ గర్ల్స్ హాస్టల్ గణేశ్ నగర్ లో కమిషనర్ మొహమ్మద్ ఆయాజ్ , సౌందర్య హాస్టల్ వార్డెన్, విద్యార్థులు పాల్గొన్నారు

# బేడ బుడగ జంగాలకు స్థలం ఉన్నవారికి ఆరు లక్షలు...

**- స్థలం ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లల్లో కూడా 40 శాతం కేటాయించాలి.-**
**- బేడ బుడగ జంగం - జన సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిరిపాటి వేణు**

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ డిసెంబర్ 14**
హుజురాబాద్: బేడ బుడగ జంగాలకు స్థలం ఉన్నవారికి ఆరు లక్షలు స్థలం ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లల్లో 40 శాతం కేటాయించాలని బేడ బుడగ జంగం - జన సంఘం రాష్ట్ర అధ్యక్షులు



సిరిపాటి వేణు డిమాండ్ చేశారు. హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వోడితల ప్రణవ్ బాబుకి బేడ బుడగ జంగం - జన సంఘం తరపున వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇల్లు కేటాయించడం జరిగిందని, ఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గంలో పూరి గుడిసెలలో నివసిస్తున్న మా బేడ బుడగ జంగాలకు స్థలం ఉన్నవారికి ఆరు లక్షల రూపాయల చొప్పున 40 శాతం కేటాయించాల్సిందిగా కోరారు. స్థలం ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లల్లో కూడా 40 శాతం కేటాయించాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రణవ్ బాబు తమ సమస్యను మంత్రులు, సీఎం రేవంత్ రెడ్డికి వివరించి నిరుపేద బేడ బుడగజంగాలను ఆదుకోవాలని అన్నారు. గతంలో ఇచ్చిన పలు హామీలను కూడా నెరవేర్చి ఎస్సి ఉప కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కోరారు. కాగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని బేడ బుడగ జంగంబి జన సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిరిపాటి వేణు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో బేడా బుడగ జంగం రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులు, కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చికిత్స నిమిత్తం 99,000/ తొంబై తొమ్మిది వేల రూపాయల ఎల్ఓసీ ని అందజేసిన నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి

**కరపత్రం దినపత్రిక మెదక్ నర్సాపూర్.**
వెల్దుర్తి మండలానికి చెందిన ఎం.యాదగిరి అనారోగ్యంతో హైదరాబాద్ పంజాగుట్ట నిమ్స్ ఆసుపతిలో చికిత్స పొందుతున్నారు ఇందుకుగాను ఆపరేషన్ నిమిత్తం మంజూరైన తొంబై తొమ్మిది వేల రూపాయల ఎల్ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే




సునితారెడ్డి శనివారం నర్సాపూర్ పట్టణ సమీపం లోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాల ఆవరణలో భాదితుని తండ్రి పోచయ్యకుఅందజేశారు,ఈ సందర్భంగా సునితారెడ్డి మాట్లాడుతూ ఆర్థిక స్థితిగతులు బాగాలేక వైద్యం చేయించుకునే స్థోమత లేక అనేక మంది అప్పులు చేసి ఇబ్బందుల పాలవుతున్నారు కావున వారికి సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రా గౌడ్, పట్టణ బల్దియా ఉపాధ్యక్షులు నయీం ఉద్దీన్ సత్యం గౌడ్ ,మండల పార్టీ అధ్యక్షులు భోగ శేకర్, రాజా రమణ గౌడ్, భూపల్ రెడ్డి ,మోహన్ రెడ్డి ,మనోహర్ రెడ్డి, కౌన్సిలర్ సునితా బాల్ రెడ్డి ,మహేందర్ రెడ్డి , సురేష్ గౌడ్ ,సుధాకర్ రెడ్డి, విఠల్ గుప్త, కృష్ణ గౌడ్,ఆనంద్ కుమార్,మురళీ గౌడ్ , తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్ ను పరామర్శించిన ఒడితల ప్రణవ్...





**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట డిసెంబర్ 14.....**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య సోదరుడు బుచ్చన్న అనారోగ్యంతో ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించిన హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్లు పొనగంటి రాము . దేశిని కోటి . బొంగోని వీరన్న . రావి కంటి రాజు. పొనగంటి రవీందర్. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సుంకరి రమేష్. వీణవంక మండల అధ్యక్షులు సాయబ్ హుసేన్.ములుగురి సదయ్య. మైస మహేందర్ .కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.